www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 జనవరి 2024
5
ఏలూరు

37 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం..!

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో 37 మంది ఎస్‌ఐలకు స్థానచలనం చేస్తూ ఏలూరు రేంజ్ డిఐజి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఏలూరు రేంజ్ పరిధిలో గత కొంతకాలంగా ఎస్ఐ, సిఐలకు ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ బదిలీలు చేపట్టారు. ఇందులో భాగంగానే 26 మంది ప్రమోటివ్ ఎస్‌ఐలకు, 11 మంది రెగ్యులర్ ఎస్‌ఐలకు ఏలూరు రేంజ్ పరిధిలోని కృష్ణ, కాకినాడ, ఏలూరు జిల్లాలతోపాటు ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీలు చేశారు. మొత్తంగా 37 మంది మహిళ, పురుష ఎస్‌ఐలకు స్థానం చలనం జరిగింది. ఈ మేరకు ఆదేశాలను గురువారం రాత్రి విడుదల చేసినట్లు సమాచారం.

ఖరీఫ్‌లో రెండు జిల్లాల రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. మిచౌంగ్ తుపానుకు రెండు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. సర్వం కోల్పోయిన కౌలురైతులంతా రోడ్డునపడ్డారు. పంట నష్టపరిహారం అందితే దాళ్వా పెట్టుబడులకు ఉపయోగపడతాయని అన్నదాత ఆశగా ఎదురుచూస్తున్నాడు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేతపై ఎటువంటి కదలిక లేకుండా పోయింది. ఎలక్షన్ నోటిఫికేషన్ వస్తే నష్టపరిహారం సొమ్ములు ఆగిపోతాయోమోనన్న భయం రైతులను వెంటాడుతోంది. వెంటనే పంట నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టం ఇచ్చేదెప్పుడు..!

ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లో 87 వేల ఎకరాల్లో పంట నష్టం
తుపాను దెబ్బకు తీవ్ర నష్టాలతో రోడ్డున పడ్డ కౌలురైతులు
దాళ్వా పెట్టుబడుల కోసం నానా అవస్థలు
పంట నష్టపరిహారం కోసం రైతుల ఎదురుచూపులు
ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైతే పరిహారం అందజేతపై అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లోనూ దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇక మొక్కజొన్న, మినుము, పత్తి, వేరుశెనగ, పొగాకు, చెరకు వంటి అనేక పంటలను రైతులు వేశారు. వర్షాకాలం నాలుగు నెలల కాలంలో మూడు నెలలు వర్షాలు పడక లోటు వర్షపాతం ఏర్పడింది. ఖరీఫ్ సాగులో నీటిఎద్దడి సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవి తరహాలో ఎండలు కాచాయి. తెగుళ్లు చుట్టుముట్టి రైతులు నానా అవస్థలు పడ్డారు. అన్ని ఒడుదుడుకులను ఎదుర్కొని ఖరీఫ్‌సాగును రైతులు ముందుకు నడిపించారు. ఎంతో సంతోషంగా ఖరీఫ్ మాసూలును రైతులు ప్రారంభించారు. పట్టుమని వారంరోజులు గడవకముందే డిసెంబర్ మొదటివారంలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడింది. ఈదురుగాలులు, భారీ వర్షాలు ముంచెత్తాయి. పొలాల్లో మోకాళ్లలోతు వర్షపు నీరు నిలిచిపోయింది. ధాన్యపు రాశులన్నీ తడిసి ముద్దయిపోయాయి. పంట పొలాలన్నీ నేలకొరిగి నీటిలో తేలిఆడాయి. రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మొక్కజొన్న, మినుము, పొగాకు వంటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. వర్షపు నీరు తగ్గిన తర్వాత అధికారులు పంట నష్టపరిహారం అంచనాలకు దిగారు. పశ్చిమగోదావరి జిల్లాలో 49,495 ఎకరాల్లో పంట నష్టం జరగ్గా వరి 47,657 ఎకరాలు, మినుము 1762 ఎకరాలు, వేరుశెనగ 75 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఏలూరు జిల్లాలో 37,936 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా వరి 22,045 ఎకరాల్లో, మొక్కజొన్న 4,366 ఎకరాలు, మినుము 241 ఎకరాలు, పత్తి 2,181 ఎకరాలు, వేరుశెనగ 938 ఎకరాలు, పొగాకు 8,160 ఎకరాలు, చెరకు రెండెకరాల్లో పంట దెబ్బతింది. రెండు జిల్లాల్లో మొత్తం 87,431 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు తేల్చి ప్రభుత్వానికి నివేదించారు. పైన చెప్పిన లెక్కలన్నీ 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంటలు మాత్రమే. 33 శాతంలోపు దెబ్బతిన్న పంటపొలాలను నిబంధనల పేరుతో లెక్కల్లోకి తీసుకోలేదు. దీంతో ఎంతోమంది రైతులకు నష్టపరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. రైతులు ఎకరాకు రూ.30 వేలకు పైగా నష్టపోయిన పరిస్థితి నెలకొంది. పంట నష్టపరిహారం కింద ప్రభుత్వం ఇచ్చే సాయం మాత్రం రూ.6 వేలు మాత్రమే. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అదే ఏడాదిలో పంట నష్టపరిహారం ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. గడిచిన ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి నివేదికలు సమర్పించి చాలాకాలం గడుస్తున్నా ఇప్పటికీ పరిహారం జమకు సంబంధించిన కదలికలు లేకుండా పోయాయి. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నోటిఫికేషన్ విడుదలైతే ప్రభుత్వం అధికారాలు కోల్పోతుంది. దీంతో ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం సొమ్ము విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే పంట నష్టపరిహారం అందుతుందో లేదో అన్న భయం రైతులను వెంటాడుతోంది.

కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం..

రెండు జిల్లాల్లో జరుగుతున్న వ్యవసాయ సాగుకు సంబంధించి 70 శాతానికి పైగా కౌలురైతులే చేస్తున్నారు. పంటను కోల్పోయిన రైతుల్లో కౌలురైతులే అధికశాతం ఉన్నారు. కానీ ప్రభుత్వం ఈ క్రాఫ్‌లో ఉన్న పేర్లనే పంట నష్టనమోదు జాబితాలో చేర్చారు. ఈ క్రాఫ్‌లో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు లేవు. దీనికి ప్రధాన కారణం కౌలురైతులందరికీ కౌలుకార్డులు జారీచేయకపోవడమేనని చెప్పొచ్చు. పంటను కోల్పోయిన కౌలు రైతులకు కాకుండా భూయజమానికి పరిహారం అందే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కౌలురైతులకు పరిహారం, బీమా అందేవిధంగా చర్యలు తీసుకోకపోతే వాస్తవ సాగుదారుడైన కౌలురైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. కౌలురైతుకు నష్టపరిహారం అందజేస్తే రబీ పెట్టుబడులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రభుత్వం అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

22,244 మంది ఖాతాల్లో రూ.2.98 కోట్లు జమ

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు, వడ్డీ రీయింబర్స్ మెంట్ కింద 22,244 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.98 కోట్ల నగదు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు, వడ్డీ రీయింబర్స్ మెంట్ కింద లబ్ధిదారుల ఖాతాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంప్యూటర్ బటన్ నొక్కి జమచేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డైరెక్టర్ ఘంటా సంధ్య, హౌసంగ్ పీడీ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని 22,844 మంది లబ్ధిదారులకు మొదటి విడత వడ్డీరాయితీగా రూ.2.98 కోట్లు నగదు జమకు సంబంధించి లబ్ధిదారులకు జెడ్‌పి ఛైర్ పర్సన్, కలెక్టర్ నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు 83,825 గృహాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన - వైఎస్ఆర్ బిఎల్ సి(పట్టణ) పథకంలోను, 15,049 గృహాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన - వైఎస్ఆర్ (గ్రామీణ) పథకంలో కలిపి మొత్తం 98,874 గృహాలు రూ.1779.93 కోట్ల ప్రాజెక్ట్ విలువతో మంజూరైన 29080 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ ఇళ్ల నిర్మాణం కోసం రూ.708.78 కోట్లు ఖర్చయ్యిందని తెలిపారు. జిల్లాలో మొదటి విడతగా వడ్డీరాయితీగా 22,844 మందికి రూ. 2.98 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు స్థలం, గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోందన్నారు. అదే విధంగా పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణానికి ఇచ్చే నగదుతోపాటు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులుగా ఉన్న మహిళలందరికీ ప్రభుత్వం అదనపు రుణాలు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్వయం సహాయక బృందాల ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

జెడ్‌పి ఛైర్ ఛైర్మన్ పద్మశ్రీ ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలని జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం పెదపాడు మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యతిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా 33 లక్షలకు పైగా నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించడంతోపాటు సొంతిళ్లు నిర్మిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేసి జగనన్న గృహ నిర్మాణాలలో ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. పెదపాడు మండలంలో పేదలకు 3851 ఇళ్ల స్థలాలతో పాటు ఇల్లు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో 1205 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, 2003 ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి పెదపాడు మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవిఎస్ఆర్.రవికుమార్, గృహ నిర్మాణ శాఖ డివిజనల్ ఇంజనీర్ రమాకాంత్, పెదపాడు తహాశీల్దార్ విజయకుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె.తేజ రతన్ పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన : కమిషనర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కులగణన సర్వే శుక్రవారం ఉదయం నుంచి ఏలూరు నగరంలో ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి సచివాలయంలో ఉండే అందరి సెక్రటరీలకు కొన్ని కొన్ని క్లస్టర్లు కేటాయించబడి ఉన్నాయని వెల్లడించారు. క్లస్టర్ అనగా వాలంటీర్ అని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి సెక్రటరీ తనకు సంబంధించిన వాలంటీర్స్ తీసుకొని మొదటిగా ఒక వాలంటీర్ ఏరియాలో ఒక ఇంటి నుంచి మొదలుపెట్టి ఈ కులగణన చేస్తారని తెలిపారు. మొదటగా గృహ యజమాని నుంచి మౌలిక విషయాలు తీసుకుని, దానిపై గృహ యజమాని, వాలంటీర్ ఇకెవైసి(ఫింగర్ ప్రింట్) చేస్తారని వివరించారు. తర్వాత సామాజిక ఆర్థిక పరిస్థితులు అన్నింటిని నమోదు చేసుకుని తిరిగి యజమాని, వాలంటీర్, సంబంధిత సెక్రటరీ ఇకెవైసి చేస్తారన్నారు. దీతో ఆ ఇంటికి సంబంధించిన కులగణన పూర్తవుతుందన్నారు. కనుక శుక్రవారం నుంచి జరిగే కులగణన సామాజిక, ఆర్థిక, స్థితి సర్వేకు తోడ్పాటు అందించవలసినదిగా ప్రజలందరినీ కోరుతున్నట్లు తెలిపారు.

అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

సామాజిక సమతా సంకల్ప బైక్ ర్యాలీ - నేడు విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన బైక్ ర్యాలీకి అపూర్వ స్పందన లభించింది. ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఈడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు దళితనేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇండోర్ స్టేడియం నుంచి మొదలైన బైక్ ర్యాలీ ఫైర్ స్టేషన్, జ్యూట్ మిల్, పాత బస్టాండు మీదుగా ఎఎస్ఆర్ స్టేడియంకు చేరుకుంది. ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ కాంస్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, నగర మేయర్ షేక్ నూర్జాహాన్ పెదబాబు, ఈడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ నెల 19వ తేదీన విజయవాడలో అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా సామాజిక సంకల్పం పేరుతో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహణతోపాటు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మానవహారం నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 500 మంది పాల్గొనగా మానవహారంలో సుమారు మూడు వేల మంది వరకూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ ప్రవేశిక సంబంధించి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు 10 రోజుల నుంచి సామాజిక సమతా సంకల్ప కార్యక్రమం కింద అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే ఫొటో ఎగ్జిబిషన్, వివిధ పోటీలు, రక్తదాన శిబిరం తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 19న అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోబోతున్న ఘట్టంలో కుల మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ మాట్లాడుతూ 19న విజయవాడలో అత్యంత వైభవంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరగనుందన్నారు. అంబేద్కర్ సామాజిక అభివృద్ధికి తగినట్టుగా రాజ్యాంగాన్ని రూపొందించారని, ఆ మహనీయుని స్ఫూర్తితో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా విజయవాడలో జరగబోయే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ తరలిరావాలని కోరారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారన్నారు. అంబేద్కర్ ఆశయాలను జగన్మోహన్‌రెడ్డి పుణికి పుచ్చుకున్నారన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు నడుస్తున్న ముఖ్యమంత్రికి అందరూ ఆశీస్సులు అందించాలని కోరారు. ఈడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బిసి నాయకులు ఘంటా ప్రసాదరావు, జుజ్జువరపు విజయనిర్మల, పొలిమేర హరికృష్ణ, నేతల రమేష్, మేతర అజేయ్‌బాబు, మెండెం సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ షేక్ నూర్జహాన్

సమస్యలు పరిష్కరించే వరకూ పోరు

38వ రోజు కొనసాగిన సమ్మె - జిల్లాలో అంగన్వాడీల 24 గంటల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు 38 రోజులుగా సమైక్యంగా చేస్తున్న పోరాటం అభినందనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అభినందించారు. గురువారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన సంఘీభావం తెలిపారు. కొద్దిసేపు వారితో కలిసి నినాదాలు చేశారు. మాటతప్పేది లేదు సమ్మె ఆపేది లేదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తరహాలోనే నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలకు ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా పట్టు విడవకుండా చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. ఆయన వెంట సిపిఎం నాయకులు తెల్లం రామకృష్ణ, అనుమోలు మురళీ, మడకం సుధారాణి, మడకం కుమారి ఉన్నారు.

ఏలూరు అర్బన్ : అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మె 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గురువారం ఏలూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షలను యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 38 రోజుల నుంచి అంగన్వాడీలు చాలా పట్టుదలతో సమ్మె చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెకు మద్దతుగా సిఐటియు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు జవిఎల్.నరసింహారావు, ప్రస్తుత సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడి మద్దతు తెలియజేశారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల దీక్షలో ఎం.మహిమ, సిహెచ్.నాగదుర్గ, బి.జ్యోతి, వై.పద్మ, భాగ్యలక్ష్మి, మాధవి కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఏలూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు రజిని, స్వప్న, ఆందోళనమ్మ, సీతామాలక్ష్మి, రామలక్ష్మి, ఉదయలక్ష్మి, మణి, సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు, బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండల కేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 38వ రోజుకు చేరుకున్నాయి. 38వ రోజు కొయ్యలగూడెం నిరవధిక సమ్మెలో యుటిఎఫ్ నాయకులు ఎ.విక్టరు, ఎస్.రమేష్ బాబు, కె.రాంబాబు పాల్గొని సంఘీభావం తెలియజేశారు. వెంటనే అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివ రత్న కుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునితరయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎమ్.వెంకటలక్ష్మి, ఎమ్.మంగా, శ్రీదేవి, నుర్జాహన్ పాల్గొన్నారు.

చింతలపూడి : మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె 38వ రోజుకు చేరుకుంది. విజయవాడలో రాష్ట్ర నాయకత్వం నిరవధిక నిరాహార దీక్షలకు పూనుకోవడంతో ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీ నాయకత్వంతో చర్చలు జరిపి సమ్మె, నిరవధిక నిరాహార దీక్షలు విరమింప చేయకపోతే రాబోయే కాలంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాంతి, సరళ, అరుణ, హేమలత, శ్యామల, వెంకమ్మ నాయకత్వం వహించారు.

భీమడోలు : భీమడోలు కేంద్రంగా అంగన్వాడీలు గత 38 రోజులుగా కొనసాగిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని గురువారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ నాయకులు జి.మోహన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాజారావు సందర్శించారు. వారు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రెండు రోజుల్లో ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల స్పందించకుంటే కార్మిక వర్గాన్ని సమీకరించి 20వ తేదీన రాస్తారోకో కార్యక్రమం నిర్వహిస్తామని, అప్పటికి ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

నిడమర్రు : నిడమర్రులో అంగన్వాడీల సమ్మె 38వ రోజు కొనసాగింది. సమ్మెలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కె.జయమ్మ, నాగేశ్వరి, మల్లేశ్వరి, కమల, రామలక్ష్మి, కెవి.సత్యవతి, రాధా మాట్లాడారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ గురువారానికి 38వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షకు మండల టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం వారికి రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండలరావు, కెవిపిఎస్ నాయకులు ఫ్రాన్సిస్, టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, ఎంపిటిసి నాలి శ్రీను, రాజబాబు, సాంబ, సోమసుందరం, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, వరలక్ష్మి, మంగ, ఎస్తేరు, సరళ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరసన దీక్ష గురువారం 38వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎన్ఆర్ హనుమాన్లు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి.రాజు, నరసింహ, ఆదిలక్ష్మి, రాజకుమారి, విజయ, ప్రమీల, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 38వ రోజున విజయవాడ ధర్నా చౌక్‌కు తరలి వెళ్లారు. డిమాండ్ల పరిష్కారంకై ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా ధర్నా చౌక్ వద్ద జరిగిన రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. అంగన్వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

ఏలూరులో 24 గంటల దీక్షల్లో నినదిస్తున్న అంగన్వాడీలు

టి.నరసాపురం : మాట్లాడుతున్న రవి

చింతలపూడిలో అంబేద్కర్‌కు వినతినిస్తూ..

జీలుగుమిల్లిలో మాట్లాడుతున్న ఫ్రాన్సిస్

పెచ్చులూడుతున్న భవనం పై భాగం

ప్రమాదకరంగా ఇఒపిఆర్‌డి కార్యాలయం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ఇఒపిఆర్‌డి కార్యాలయం శిథిలావ్యవస్థకు చేరుకుంది. పై నుంచి పెచ్చులు పడుతుండంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళనకు గురౌవుతున్నారు. దీన్ని 1975లో నిర్మించారు. ఈ భవనం నేడు స్లాబ్ పైనుంచి పెచ్చులూడిపడడంతో ప్రమాదకరంగా మారింది. అనేక పనులు నిమిత్తం కార్యాలయానికి పంచాయతీ కార్యదర్శులను కలవటానికి వస్తుంటారని, ఎప్పుడు ఎవరి మీద పడుతుందో తెలియక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయవల్సిందిగా కోరుతున్నారు.

బ్యానర్లు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలో ఏర్పాటు చేసిన అన్ని రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని జనసేన తరపున ముత్యాల కామేష్ గురువారం సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిని అందజేశారు. అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియాన్ని తక్షణమే పూర్తి చేయాలని, పట్టణంలో ఉన్న ప్రధాన రహదారులను విస్తరించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు ఈటుకూరి చంటి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరులపై దౌర్జన్యం దుర్మార్గం

ప్రజాశక్తి - ముదినేపల్లి

విధి నిర్వహణలో ఉన్న పత్రికా విలేకరులపై వణుదుర్రుకి చెందిన ఆక్వా రైతు దౌర్జన్యం చేయడాన్ని పలువురు దళిత నాయకులు ఖండించారు. గురువారం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న దళిత విలేకరులపై ఆక్వా రైతు దౌర్జన్యం చేయటం, బడా బాబులు భయపెట్టడం, బెదిరించడం వంటి చర్యలు మానుకోవాలన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

ట్రక్ డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ గురువారం భీమడోలు జంక్షన్‌లో ట్రక్కు డ్రైవర్లు, క్లీనర్లు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా భీమడోలు మండల శాఖ జయహో రథసారథి డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఏలూరు జిల్లా నాయకులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పేరాబత్తుల శ్రీనివాస్, బి.అభి ప్రసంగించారు.


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఆరోగ్యవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి - పోలవరం

కొత్త పట్టిసీమ పంచాయతీని ఆరోగ్యవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దేంతకు మరింత కృషి చేస్తానని కొత్తపట్టిసీమ గ్రామ సర్పంచి మైగాపుల విజయదుర్గ తెలిపారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతిలో రాష్ట్రమంత్రి బూడి ముత్యాల నాయుడు, కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీపై జాతీయ స్థాయి సదస్సులో సర్పంచి మైగాపుల విజయదుర్గ పాల్గొని కొత్తపట్టిసీమ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ముఖ్యంగా దోమల నివారణకు, పారిశుధ్యంపై తీసుకున్న చర్యలు వివరించారు. జిల్లా నుంచి ఇద్దరు సర్పంచులు ఎంపిక చేయడం జరిగింది.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండు రోజులపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను తెలిపారు. పోలవరం మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో గురువారం శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొని గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంఇటి యు.రాజారావు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి గ్రామ పంచాయతీలకు వస్తున్న నిధులు, గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను కలుపుకొని చేపట్టాల్సిన పనులను రూపొందించుకోవాలని తెలిపారు. జిపిడిపి(గ్రామ పంచాయతీ డెవలప్ మెంట్ ప్లాన్) ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. తదుపరి జిపిడిపిలో సర్పంచులు, కార్యదర్శులు పాత్రను వివరించారు. సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు జిపిడిపిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లేశ్వరి, ఎఒ రమణ బాబు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మాట్లాడుతున్న ఎంపిపి

ముసునూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు సహకారంతో తమ గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని ముసునూరు మండల ఎంపిపి కొండ దుర్గాభవాని వెంకట్రావ్ అన్నారు. గురువారం మండలంలోని మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి విధానాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్య నారాయణ, ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కూచిపూడి సాయిరామ్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోడి పందేల శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని పి.అంకంపాలెం గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై సిబ్బందితో కలిసి దాడులు చేయగా ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,580 నగదు, ఒక కోడి, కోడి కత్తెను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారందరిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలియజేశారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ నుంచి ఆంధ్రలోని పోలవరం మండలానికి తరలిస్తున్న 5 బీర్ బాటిళ్ల మద్యంను పట్టుకోవడం జరిగిందని హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి : ఎంపిపి


కొయ్యలగూడెం : అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సామాజిక సమతా మూర్తి, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ప్రతిఒక్కరూ తరలి రావాలని కొయ్యలగూడెం మండల పరిషత్ అధ్యక్షులు, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి గంజిమాల రామారావు పిలుపునిచ్చారు. గురువారం కొయ్యలగూడెం మండల పరిషత్, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో సామాజిక సమతా అవగాహన ర్యాలీ జరిగింది. తొలుత కొయ్యలగూడెంలోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు, అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. అంబేద్కర్ మహాశయుడు రాసిన రాజ్యాంగం వల్ల లాంటి ఎందరో రాజకీయ రంగంలో మనగలుగుతున్నారన్నారు. ఆయన చూపిన సామాజిక న్యాయం ప్రపంచంలోనే గుర్తింపు పొందిందన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్క జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టడమే కాకుండా 125 అడుగుల విగ్రహం విజయవాడలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఇందుకోసం బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రావాలనుకున్న వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి బేబీ శ్రీలక్ష్మి ఏర్పాట్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ముప్పిడి విజయ కుమారి(పరింపూడి), లింగశెట్టి అనంత లక్ష్మి(బయ్యనగూడెం), ఎంపిటిసిలు జాన్ డేవిడ్, నారా అన్నపూర్ణ, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ బాజీ, మండల పశువుల వైద్యాధికారి శ్రీనివాసన్, ఎపిఒ కావూరి నాగేశ్వరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ఉదయ్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల యుటిఎఫ్ మండల జనరల్ సెక్రటరీ సరంగుల రమేష్ పాల్గొన్నారు.


ఏలూరులో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం

ఏలూరు అర్బన్ : భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉన్న గిరిజన భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది మెప్మా ఉద్యోగులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెప్మా పీడీ బి.ఇమ్మానుయేల్ పాల్గొని ఉద్యోగులతో పాటు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, మెడికల్ ఆఫీసర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, పిఆర్ఒ కెవి రమణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి విజయానికి నాంది

చెమట చుక్క ద్వారా షుగర్ వ్యాధి పరికరం సృష్టికర్త శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఓటమి విజయానికి నాంది అని జీవ రసాయన శాస్త్రవేత్త, చెమట చుక్క ద్వారా షుగర్ వ్యాధి నిర్ధారణ పరికరాన్ని కనుగొని కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటీవల పేటెంట్ హక్కులు పొందిన ఉంగుటూరు మండల నారాయణపురానికి చెందిన వూసా చిరంజీవి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి నారాయణపురంలో డాక్టర్ వూసా చిరంజీవి శ్రీనివాసరావుకు పౌరసన్మానం చేశారు. సర్పంచి దిడ్ల అలకనంద శ్రీను అధ్యక్షతన ఏర్పాటైన సభకు ముఖ్యఅతిథిగా శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామంలో ఇంత మంది ఆదరాభిమానాలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. తాను ఈ ఉన్నత స్థితికి రావటానికి కారణం తన తల్లి కష్టపడి చదివించడం వల్లే అన్నారు. చదువుకి పేదరికం అడ్డుకాదని పట్టుదల, సాధించాలనే తపన ఉంటే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరానికి చేరుకోవడం పెద్ద కష్టం కాదన్నారు. గ్రామస్తులు, సర్పంచి అలకనంద వారిని ఘనంగా సత్కరించారు. కైకరం సర్పంచి సలగల గోపి, మాజీ సర్పంచి యాళ్ల సుజీవరావు పాల్గొన్నారు.


శాస్త్రవేత్తకు గజమాలతో సన్మానం

'ఆడుదాం ఆంధ్రా'లో ఇరు గ్రామస్తుల ఘర్షణ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు హైస్కూల్ వేదికగా గురువారం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. క్రీడా స్ఫూర్తిని మరిచి కొందరు వ్యవహరించిన తీరుతో రెండు గ్రామాలకు చెందిన వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. పరుష పదజాలంతో కూడిన దుర్భాషలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు పరస్పరం చేసుకున్న దాడుల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్న రిఫరి ఒకరు చిక్కుకుపోయారు. వివరాల్లోనికి వెళితే భీమడోలు మండలం నుంచి వివిధ పోటీలకు మండల స్థాయి జట్టు ఎంపిక కోసం గ్రామాల వారీగా పోటీలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో గురువారం కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీల్లో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 14 జట్లు పాల్గొన్నాయి. ఇదే క్రమంలో పూళ్ళ-ఆగడాలలంక జట్ల మధ్య జరిగిన పోటీల్లో పూళ్ల జట్టు విజేతగా నిలిచారు. ఈ నేపథ్యంలో ఆగడాలలంక గ్రామానికి చెందిన పంతగాని అక్షర్ తమ గ్రామానికి చెందిన జట్టు ఓడిపోయిందన్న ఉక్రోసంతో పూళ్ల జట్టు సభ్యులను పరుష పదజాలంతో దుర్భాషలాడారు. ఈ విషయాలపై భీమడోలు ఎంపిడిఒ చాగంటి పద్మావతిని వివరణ కోరగా పంతగాని అక్షర్ అనే యువకుడు చట్ట విరుద్ధంగా ప్రవర్తించాడని తెలిపారు. అక్షర్‌పై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారని తెలిపారు.

చిరస్మరణీయులు ఎన్‌టిఆర్

జిల్లాలో 28వ వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ఎన్‌టిఆర్ ఇప్పటికీ రాముడుగా, కృష్ణుడుగా తెలుగు వారి మదిలో చిరస్మరణీయుడుగానే ఉన్నారని టిడిపి మండల నాయకులు ఇమ్మడి రత్నాజీ తెలిపారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి, నవరస నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి స్థానిక వైష్ణవి కళ్యాణ మండపం వద్ద రత్నాజీ ఆధ్వర్యంలో గ్రామ టిడిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ సెక్రెటరీ కూరాకుల బుజ్జి యాదవ్, మండల బిసి సెల్ అధ్యక్షులు రేవూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి కొరపాటి మనమ్మ వెంకన్న, టిడిపి సీనియర్ నాయకులు గువ్వల మావుళ్ల రావు, కొత్తపల్లి సుబ్బారావు, గువ్వల నాగ చంద్రం పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలో టిడిపి ఆధ్వర్యంలో టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి ఎన్‌టి.రామారావు 28వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎన్‌టి.రామారావు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు.

భీమడోలు : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని సంతపేట, పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఎన్‌టిఆర్ విగ్రహాలతో పాటు వడ్లపట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాల వద్ద నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. టిడిపి శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం భీమడోలుకు చెందిన టిడిపి కార్యకర్త దవులూరి మరియన్న వితరణతో సమకూర్చిన దుస్తులను పేదలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రముఖులు సిరిబత్తిన కొండబాబు, కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

చింతలపూడి : ఎన్‌టిఆర్ సినిమా రంగంలోనే కాకుండా రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని చింతలపూడి నియోజకవర్గ యువకులు సోంగా రోషన్ కుమార్, బొమ్మజి అనిల్ అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద 28 వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టిడిపి స్థాపించి తెలుగువారి ఆత్మగౌరవని నిలబెట్టిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్, పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వరరావు రాయప్ప, భాస్కర్ పాల్గొన్నారు.


భీమడోలులో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రగడవరంలో ఎన్‌టిఆర్ 28వ వర్ధంతిని గ్రామకమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవలే మరణించిన టిడిపి కార్యకర్తల కుమారుడికి చదువుకోవటానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రాజా పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి వేడుకలను ఆగిరిపల్లిలోని టిడిపి స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.మంగయ్య, ఎన్.వేణు, ఇ.శ్రీనివాసరావు, విక్టర్ బాబు, రాజు, ఖాదర్, సత్యకుమార్, శ్రావణ్ కుమార్, బి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి వేడుకలు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ముదినేపల్లి, అల్లూరు, పెదపాలపర్రు తదితర గ్రామాల్లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు కొడాలి వినోద్, దావు నాగరాజు, శోభనాద్రి చౌదరి, పలువురు టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : టిడిపి వ్యవస్థాపకులు, కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 28వ వర్ధంతిని స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు వారికి ఎన్‌టిఆర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ముసునూరి రాజా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టిడిపి నాయకులు తలపంటి రాజశేఖర్, జగ్గవరపు వెంకటరెడ్డి, అన్నే సురేష్ పాల్గొన్నారు. మండలంలోని రావిచర్ల గ్రామంలో గురువారం ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి సందర్భంగా నూజివీడు ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ కాప శ్రీనివాసు రావు ఎన్‌టిఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

జీలుగుమిల్లి : మండలవ్యాప్తంగా టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి వేడుకలను గురువారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జీలుగుమిల్లిలో టిడిపి మండల అధ్యక్షులు ఎస్.సాయి, పి.అంకం పాలెం గ్రామంలో ఎంపిటిసి నాలి శ్రీను, దర్భగూడెంలో తెలుగు యువత కార్యదర్శి తమ్మన సాంబ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంగన్వాడీల దీక్షా శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, రాజబాబు, బలరాం, కృష్ణ, నాగేశ్వరావు పాల్గొన్నారు.

కలిదిండి : ఎన్‌టిఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని మట్టగుంటలో ఆయన చిత్ర పటానికి రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగిడి వీర బ్రహ్మం, ఎస్‌సి సెల్ మండల ఉపాధ్యక్షులు బళ్ల రాజు, టిడిపి నాయకులు తిరుమలశెట్టి ఈశ్వర పరశు రాముడు, కొపనాతి కృష్ణ, మోకా వెంకట రమణ, పొన్నాల తాతారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తెడ్లం, రాజుపోతేపల్లి, బొర్రంపాలెం గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు, టి.నరసాపురంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయ్యవరపు శ్రీరామమూర్తి, నల్లూరి వెంకట చలపతి రావు, అద్దంకి జగ్గారావు, జోనుబోయిన సోంబాబు, బండి శ్రీనివాస రావు, పెద్దిన సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలవరం : తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయులు ఎన్‌టి.రామారావు అని పోలవరం టిడిపి నాయకులు అన్నారు. ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బ రాంబాబు ఆధ్వర్యంలో మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామంలో మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆధ్వర్యాన మండల కేంద్రంలో మాజీ మండల అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు పెద్దేహపు సత్యనారాయణ ఆధ్వర్యంలో గూటాల గ్రామంలో కీర్తిశేషులు ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంచె దొరబాబు, టౌన్ ప్రెసిడెంట్ పోతుల శ్రీనివాస్, ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ పిల్లి నాగరాజు, పాదం ప్రసాద్, జల్లేపల్లి నరసింహారావు, జల్లేపల్లి సుబ్బారావు, ఏనుగుల శ్రీనివాస్, కుంజర్ల సత్యనారాయణ, తాళ్లపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ముసునూరులో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

ముసునూరు: ఎన్‌టిఆర్ లాంటి మహానాయకుడు చరిత్రలో తిరుగులేని నాయకుడుని రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు అన్నారు. గురువారం మండలంలోని 16 గ్రామాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవినేని ఢలరామ్, సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, గద్దల సుహాసని మోహానరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, మందలపు ధర్మారాజు, కొల్లి గంగారామ్, పాకనాటి వీరాంజనేయులు, కోండేటి బాబి, గారపాటి నరిసింహారావు, రెడ్డి కృష్ణ, నక్కా యోహాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలివే..

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలో డి3 -ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11కెవి శాంతి నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవి సిద్ధార్ధ, విఐపి, సత్రంపాడు, ఫిరంగులదిబ్బ ఫీడర్‌లకు చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్లకు మరమ్మతులు ఈనెల 19వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చేయబడునని ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిబి.నటరాజన్ తెలిపారు. కావున శాంతి నగర్ స్టేషన్ పరిధిలోని ఆర్‌టిసి కాలనీ, సత్రంపాడు మెయిన్ రోడ్, సిఆర్ రెడ్డి కళాశాల మెయిన్ రోడ్, టిటిడి కళ్యాణ మండపం రోడ్, శాంతినగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. వినియోగదారులు గమనించి సహకరించల్సిందిగా ఆయన కోరారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొదించుకొని వాటిని సద్వినియోగ పర్చుకోవాలని రాజ్యసభ సభ్యులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు వివేక్ ఠాకూరు పేర్కొన్నారు. గురువారం ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, తహాశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితుల పట్ల సహృదయంతో మెలగాలి

ప్రజాశక్తి - మండవల్లి

ఎయిడ్స్ రోగుల పట్ల చులకన భావాన్ని వీడి ప్రతి ఒక్కరు వారి పట్ల సహృదయంతో మెలగాలని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రంట్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ రోగులను గౌరవంగా చూడాలన్నారు. దీంతో మనోధైర్యాన్ని పెంపొందించుకొని జీవిస్తారన్నారు. అనంతరం వ్యాధి పట్ల అవగాహన పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ నాగలక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచి నాగదాసి థామస్

కర్రీ పాయింట్‌లో అగ్ని ప్రమాదం

భీమడోలు : భీమడోలు జంక్షన్‌లో గురువారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.80 వేల ఆస్తి నష్టం జరిగింది. భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు తెలిపిన వివరాల మేరకు జంక్షన్‌లోని ఒక కర్రీ పాయింట్‌లో వంట గ్యాస్ లీక్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ సందర్భంగా బయటకు వచ్చే మార్గం లేక కర్రీ పాయింట్‌లో పనిచేసే ముగ్గురు మహిళలు లోపల భాగంలో చిక్కుకుపోయారు. ఊపిరి అందక ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకొని సకాలంలో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురు మహిళలను చికిత్స కోసం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. వారు అక్కడ చికిత్స పొందుతున్నారు.

CHANGE OF NAME

I, MOHAMMAD ZAFRULLA, S/o. Mohammad Saheb, D.No.12-2-27, Old Bazar, Narsapuram, Narsapuram (Mandal), W.G.Dt., A.P. I have changed my name from MOHAMMED JAFERULA, (Old name) to MOHAMMAD ZAFRULLA, (New name) hence forth I am being called MOHAMMAD ZAFRULLA, S/o. Mohammad Saheb, for all purposes.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిపి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గురజ పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశంలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. సీజనల్ వ్యాధుల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఎఎన్ఎంలు, సిబ్బంది, పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుడివాడలో గురువారం సాయంత్రం జరిగిన రా కదలిరా చంద్రబాబు సభకు కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీగా టిడిపి, జనసేనలకు చెందిన నాయకులు కార్యకర్తలు వివిధ వాహనాల్లో భారీ ర్యాలీతో ముదినేపల్లి సెంటర్ నుంచి గుడివాడ తరలి వెళ్లారు. ముదినేపల్లి నుంచి 2 వేల బైకులు, నాలుగు వేల కార్యకర్తలతో రా కదలిరా సభకు తరలి వెళ్లినట్లు నియోజకవర్గ టిడిపి యువనేత కొడాలి వినోద్ తెలిపారు.

తణుకు పురపాలక సంఘం

షార్ట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 1684/05/2023/ఇ1 తేది.17-01-2024

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. డ్రయిను పనులు	2 నెం.లు	7.90
2. బిల్డింగ్ పనులు	1 నెం.	4.20
3. వాటర్ సప్లయి పనులు	1 నెం.	4.06
4. ఇతరములు	1 నెం.	3.60

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 18-01-2024వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- కమిషనరు, తణుకు పురపాలక సంఘం